# కందనూలుపై బీఆర్ఎస్ ఫోకస్


- నేడు నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికలపై చర్చ
- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సమావేశం
- హాజరుకానున్న ఎమ్మెల్యేలు, జెడ్పీ చైర్మన్లు, జిల్లా అధ్యక్షులు
- సిట్టింగ్ స్థానం తిరిగి సాధించేలా కార్యాచరణ
- పార్టీ శ్రేణుల్లో స్థైర్యం నింపేలా సన్నాహక సమావేశం



నాగర్‌కర్నూల్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్ పెట్టింది. త్వరలో జరుగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదేశంతో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో బుధవారం నాగర్‌కర్నూల్ పార్లమెంటరీ స్థాయి సమావేశం జరుగనున్నది. ఈ సమావేశానికి సిట్టింగ్ ఎంపీ రాములుతోపాటు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, జెడ్పీచైర్మన్లు, పార్టీ జిల్లా అధ్యక్షులు సహా ముఖ్య నాయకులు హైదరాబాద్ తెలంగాణ భవన్‌కు తరలివెళ్లనున్నారు. సిట్టింగ్ స్థానాన్ని తిరిగి సాధించేలా ఈ సన్నాహక సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు.


***నేడు పార్లమెంట్‌స్థాయి సమీక్ష***

నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ సమావేశం హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో బుధవారం జరుగనున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో జోగుళాంబ గద్వాల, అలంపూర్, వనపర్తి నియోజకవర్గాలతోపాటుగా నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ స్థానంలో గత 2019ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచి గెలిచిన పోతుగంటి రాములు ప్రస్తుతం ఎంపీగా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్ గెలిచేలా పార్టీ ప్రణాళికలను రూపొందిస్తోంది. ఇందులో భాగంగా ఈనెల 3వ తేదీ నుంచి హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పార్లమెంటరీస్థాయి సమీక్షా సమావేశాలను నిర్వహిస్తోంది. ఈ సమావేశానికి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితోపాటుగా జోగుళాంబ గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, జైపాల్‌యాదవ్, మర్రి జనార్దన్‌రెడ్డి, బీరం హర్షవర్ధన్‌రెడ్డితోపాటుగా నాగర్‌కర్నూల్, వనపర్తి జెడ్పీ చైర్మన్లు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, పార్టీ మండల అధ్యక్షులు సహా పలువురు ముఖ్య నాయకులు హాజరు కానున్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో గద్వాల, అలంపూర్ మినహా మిగిలిన ఐదు స్థానాల్లో బీఆర్ఎస్ ఓడిపోయింది. దీంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఈ ప్రభావం పడకుండా మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులందరూ కలిసి పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కేటీఆర్ వ్యూహాలు ఖరారు చేయనున్నారు. ఈ ఎన్నికల్లో ఐదుచోట్ల బీఆర్ఎస్ ఓడినా పార్లమెంటరీ స్థాయిలో చూస్తే అంతరం చాలా తక్కువగానే ఉంది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు గత డిసెంబర్‌లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ 38.20 శాతం ఓట్లను సాధించింది. అదే కాంగ్రెస్‌కు 45.77ఓట్లు పోలయ్యాయి. పార్లమెంట్ పరిధిలో మొత్తం 14,00,049 ఓట్లు పోలుకాగా కాంగ్రెస్‌కు 6,39,628ఓట్లు, బీఆర్ఎస్‌కు 5,34,401ఓట్లు రాగా బీజేపీకి 1,18,513 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ 1,05,227ఓట్ల ఆధిక్యత సాధించింది. ఇలా బీఆర్ఎస్‌కు కాంగ్రెస్‌తో కేవలం 8శాతంలోపే తక్కువగా ఉండటం గమనార్హం. గత ఎన్నికలో 50.8శాతంతో బీఆర్ఎస్‌కు 4,99,672 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ పార్టీకి 3.09లక్షలు, బీజేపీ నుంచి శృతికి కేవలం 1.29లక్షల ఓట్లే వచ్చాయి. ఇలా బీఆర్ఎస్ ఎంపీ రాములు 1,89,748 ఓట్ల మెజార్టీతో గెలుపొందడం గమనార్హం. కాంగ్రెస్ దుష్ప్రచారాలను ప్రజలు నమ్మడంతో అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో బీఆర్ఎస్ ఐదు చోట్లా ఓడిపోవడం గమనార్హం. దీనిపై నిరాశ చెందకుండా పార్టీ యంత్రాంగాన్ని కిందిస్థాయి వరకు సన్నద్ధత చేసేలా ఈ సమావేశంలో నిర్దేశం చేయనున్నారు. పార్టీ శ్రేణులకు అండగా ఉంటూ ముందుకు సాగేలా కేటీఆర్ భరోసా ఇవ్వనున్నారు. ఇటీవలే కొల్లాపూర్ నియోజకవర్గం పెద్దకొత్తపల్లిలో కాంగ్రెస్ దాడిలో హత్యకు గురైన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ను దీటుగా ఎదుర్కొంటూ సిట్టింగ్ స్థానాన్ని తిరిగి నిలబెట్టుకొనేలా ఈ సమావేశంలో కార్యకర్తలకు మార్గనిర్దేశం చేయనున్నారు.





ఉప్పునుంతల మండలంలో వరినాట్లు ఊపందుకున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులతో భూగర్భజలాలు పెరిగాయి. దీంతో అధిక విస్తీర్ణంలో వరిసాగు చేశారు. ముఖ్యంగా మహిళా కూలీల కొరత ఏర్పడడంతో బీహార్‌కు చెందిన పురుషులు నాట్లు వేసేందుకు వలస వచ్చారు. ఎకరం నాటు వేసేందుకు రూ.4,700 వరకు డబ్బులు తీసుకుంటున్నట్లు కూలీలు తెలిపారు. బీహార్ నుంచి కూలీలు రావడంతో పనులు చురుకుగా సాగుతున్నాయి. – ఉప్పునుంతల, జనవరి 16




# రైతులకు వీడియో వేదికలు

- రైతు వేదికల్లో వీడియో కాన్ఫరెన్స్‌లు
- నియోజకవర్గానికి ఒకటి ఎంపిక
- రూ.3.70 లక్షల ఖర్చుతో ఏర్పాటు
- నెలాఖరులోగా అందుబాటులోకి..

నాగర్‌కర్నూల్, జనవరి 16 (నమస్తే తెలంగాణ) : రైతు వేదికలు ఇక వీడియో కాన్ఫరెన్స్ కేంద్రాలుగా మారనున్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఎంపిక చేసిన ఈ వేదికల్లో ఇకపై వీసీలు నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఈ ప్రక్రియను చేపట్టనున్నది. ఒక్కో కేంద్రం రూ.3.7 లక్షలతో నెలాఖరులోగా ఈ సేవలు అందుబాటులోకి రానున్నాయి.

దీంతో వ్యవసాయ అధికారులు, రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారనున్నది.

***రైతు వేదికల్లో వీసీలు***

రైతు వేదికలు బహుముఖ ప్రయోజనకారిగా సేవలు అందించనున్నాయి. కేసీఆర్ ప్రభుత్వం 2017సంవత్సరంలో రైతులకు సేవలు అందించేందుకు రైతు వేదికలను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా 2020లో దాదాపుగా పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చాయి. 5వేల హెక్టార్లకు ఒక రైతు వేదిక చొప్పున నిర్మించారు. క్లస్టర్ల వారీగా ఒక్కో క్లస్టర్‌కు 10 గుంటల నుంచి అర ఎకరం స్థలంలో రైతువేదికల నిర్మాణం జరిగింది. ఈ రైతు వేదికల నిర్మాణాలను ఉపాధి హామీ పథకం నుంచి రూ.8 లక్షలు కేటాయించగా, వ్యవసాయ శాఖ నుంచి రూ.12లక్షల చొప్పున రూ.20 లక్షలతో ఒక హాల్, రెండు గదులతో 2వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించడం జరిగింది. ఇందులో వ్యవసాయ విస్తరణ అధికారి ప్రతిరోజూ రైతులకు అందుబాటులో ఉంటున్నారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఏఈవోల ద్వారా రైతు వేదికల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోంది. వ్యవసాయ సీజన్ల వారీగా పంటల సాగుపై సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటుగా ప్రభుత్వం రైతులకు అమలు చేస్తున్న రైతుబంధు, రైతుబీమాలాంటి పలు పథకాల్లో అవసరమైన సహకారం అందించడంలో అలాగే గిట్టుబాటు ధరలు పొందేలా తగిన సలహాలు ఇవ్వడంలో రైతు వేదికలు కీలకంగా మారాయి. అదే విధంగా రైతు సమావేశ మందిరాలుగా, గోదాంలుగా, విత్తన, ఎరువు, ధాన్యం నిల్వ కేంద్రాలుగా వినియోగించేందుకు వ్యవసాయ శాఖ నిర్ణయించింది. అలాంటి రైతు వేదికల్లో ఇకపై వీడియో కాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు వ్యవసాయ విశ్వవిద్యాలయం చర్యలు తీసుకుంటోంది. నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఈ రైతు వేదికలను వీసీల కోసం ఎంపిక చేసింది. నియోజకవర్గ రైతులందరికీ అందుబాటులో ఉండే వేదికలను దీనికోసం ఎంపిక చేయడం గమనార్హం. రైతులందరికీ అనువుగా ఉండేలా, ఇంటర్నెట్, సరిపడా స్థలం ఉండే వేదికలనే వీసీల కోసం అధికారులు ఇప్పటికే ప్రతిపాదించారు. కాలానుగుణంగా వచ్చే మార్పులకు అనుగుణంగా అధిక దిగుబడులు సాధించేలా రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకురావడమే రైతువేదికల్లో వీసీల సౌకర్యం కల్పన ఉద్దేశం. ఇప్పటికే ఎంపిక చేసిన కేంద్రాల్లో రూ.3.7లక్షలతో వీడియో కాన్ఫరెన్స్ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులు సమీక్ష సమావేశాలు నిర్వహించడానికి వీలవుతుంది. ప్రస్తుతం కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల్లో వీసీలకు వ్యవసాయ శాఖ అధికారులు హాజరవుతూ వస్తున్నారు. ఇకపై రైతు వేదికల్లోనే అధికారులకు వీసీలు అందుబాటులోకి వస్తాయి. అలాగే రైతులకు కూడా వీసీలతో పాటుగా కాలానుగుణంగా వ్యవసాయంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై అవగాహన కల్పించేందుకు వీడియోలు కూడా ఇక్కడ ప్రదర్శించడం జరుగుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు నేరుగా రైతులతో మాట్లాడటంతోపాటు సలహాలు ఇవ్వడం, తీసుకోవడానికి ఈ కేంద్రాలు సౌకర్యంగా ఉంటాయి. ప్రతి నియోజకవర్గంలో ఈ వీడియో కాన్ఫరెన్స్ సేవలు అందుబాటులోకి రావడంపై వ్యవసాయ శాఖ అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నాలుగు రైతు వేదికలను అధికారులు ఎంపిక చేశారు.

అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూరు మండలంలో సీఎం రేవంత్‌రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గం బిజినేపల్లి మండలంలోని పాలెం, కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్దకొత్తపల్లి మండలం పెద్దకార్పాముల, కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలంలోని రాచూరు గ్రామాల్లోని రైతు వేదికల్లో వీసీ నెలాఖరు వరకు అందుబాటులోకి రానున్నది.




రైతు వేదిక లోపలి భాగం

# జోగుళాంబకు విస్తృత ప్రచారం కల్పించాలి

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు



జోగుళాంబ ఆలయంలో క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జనవరి 16 : తెలంగాణలో ఏకైక శక్తి పీఠంగా విరాజిల్లుతున్న జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు విస్తృత ప్రచారం కల్పించాలని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు అధికారులకు సూచించారు. సోమవారం జోగుళాంబ అమ్మవారి ఆలయంలో జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ విశిష్టతను గ్రామగ్రామానికి చాటాలన్నారు. భక్తుల మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆలయాభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. ఆలయంలో జరుగుతున్న నిత్య పూజాది కార్యక్రమాలను క్యాలెండర్‌లో ప్రచురించడం శుభపరిణామమన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే ఆలయాల్లో పూజలు చేశారు. కాగా, మకర సంక్రాంతిని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలోని వీరభద్ర స్వామి ఆలయంలో నందికోళ సేవను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్య, ఈవో పురేందర్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ శేఖర్‌రెడ్డి, సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ, అడివప్ప తదితరులు పాల్గొన్నారు.

***యువత క్రీడల్లో రాణించాలి..***

రాజోళి, జనవరి 16 : యువత క్రీడల్లో రాణించాలని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. మండలంలోని మాన్‌దొడ్డిలో సంక్రాంతిని పురస్కరించుకొని స్వయంభూ లక్ష్మీమాధవస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. అనంతరం ఓపెన్ కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడాపోటీలు నిర్వహించడంపై ఆనందం వ్యక్తం చేశారు. గ్రామీణ క్రీడలకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వాలీబాల్‌తోపాటు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాసులు, వడ్డేపల్లి వైస్ ఎంపీపీ చంద్రగౌడ్, సర్పంచ్ సవారి, ఎంపీటీసీ మన్సూర్, వెంకట్రాముడు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.

# కృష్ణాబ్రిడ్జిపై రాకపోకలు నిషేధం


నారాయణపేట/మక్తల్ టౌన్/కృష్ణ, జనవరి 16 : తెలంగాణ– కర్ణాటక రాష్ట్రాలను కలుపుతూ కృష్ణానదిపై ఉన్న వంతెన మరమ్మతుల కారణంగా 45 రోజులపాటు కృష్ణానది వంతెనపై రాకపోకలు నిషేధించినట్లు నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్–167పై ఉన్న కృష్ణా బ్రిడ్జి మరమ్మతుల కారణంగా తెలంగాణ ప్రాంతం నుంచి కర్ణాటకకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిపివేసినట్లు చెప్పారు. మక్తల్ నియోజకవర్గం మీదుగా వచ్చే వాహనాలను దారి మళ్లించేందుకు మరికల్ సబ్‌స్టేషన్ వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశామన్నారు. హైదరాబాద్ నుంచి రాయిచూరుకు వెళ్లే వాహనాలను జడ్చర్ల మీదుగా మళ్లించడం జరుగుతుందన్నారు. మరికల్, నారాయణపేట నుంచి వచ్చే వాహనాలను మరికల్ సబ్‌స్టేషన్ నుంచి జూరాల డాం గద్వాల మీదుగా కేటీదొడ్డి నుంచి రాయిచూర్ వెళ్లేందుకు డైవర్షన్ చేసినట్లు వెల్లడించారు. వాహనదారులు రోడ్డు డైవర్షన్‌ను గమనించాలన్నారు.

## భర్తను చంపిన భార్య

బల్మూరు, జనవరి 16 : రోజూ తాగి వచ్చి ఇబ్బందులు పెడుతున్నాడనే కారణంగా భర్తను భార్య హత్య చేసిన ఘటన మండలంలోని కొండనాగులలో చోటు చేసుకున్నది. ఎస్సై శేఖర్‌రెడ్డి కథనం ప్రకారం.. కొండనాగులకు చెందిన ఎండీ మహిమూద్(47) ప్రతి రోజూ తాగివచ్చి కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తుండేవాడు. ఆదివారం రాత్రి తాగి వచ్చి భార్యతో గొడవ పడ్డాడు. ఈ క్రమంలోనే మహిమూద్‌పై భార్య నిరంజన్‌బీ, కుమారుడు ఖాజాపాషా గొడ్డలితో దాడి చేయగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని సీఐ అనుదీప్ పరిశీలించారు. మహిమూద్ తల్లి కరీంబీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

# చాంపియన్ హర్యానా

- ముగిసిన నేషనల్ ఫాస్ట్–5 నెట్‌బాల్ టోర్నీ
- పురుషులు, మహిళల విభాగంలో హర్యానా విజేత
- రన్నర్‌గా నిలిచిన తెలంగాణ, కర్ణాటక జట్లు



రన్నర్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 16 : జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో నేషనల్ ఫాస్ట్–5 సీనియర్ మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ముగిసింది. మంగళవారం జరిగిన ఫైనల్‌లో పురుషుల విభాగంలో హర్యానా జట్టు 32–20తో తెలంగాణపై గెలిచింది. మహిళల విభాగంలో హర్యానా జట్టు 43–23తో కర్ణాటకపై విజయం సాధించింది. మహిళా విభాగంలో తెలంగాణ, ఢిల్లీ, పురుషుల విభాగంలో ఢిల్లీ, కేరళ జట్లు మూడోస్థానంలో నిలిచాయి.

***గెలుపోటములు సమానంగా స్వీకరించాలి : యెన్నం***

క్రీడల్లో గెలుపోటములు సమానంగా స్వీకరించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టోర్నీ ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయస్థాయి టోర్నీలకు దాతలు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. నాలుగు రోజులపాటు దేశంలో 28 రాష్ట్రాల క్రీడాకారులకు ఆతిథ్యం ఇవ్వడం, మహబూబ్‌నగర్ ప్రేమ, అప్యాయతను పొందారని గుర్తుచేశారు. క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని, ఇలాంటి టోర్నీని ఏటా నిర్వహించాలన్నారు. జిల్లాలో ప్రతిభగల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతో మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సెక్రటరీ విజేందర్‌సింగ్, టోర్నీ చైర్మన్ అమిత్‌అరోరా, కన్వీనర్ అకాశ్‌బత్ర, నెట్‌బాల్ ఫెడరేషన్ ఎంపైర్ బోర్డు చైర్మన్ అశోక్‌ఆనంద్, జిల్లా క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్, రాష్ట్ర నెట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సురేశ్‌కుమార్, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, ఉపాధ్యక్షుడు సాదత్‌ఖాన్, ట్రెజరర్ సోహెల్, రామ్మోహన్, అంజద్, షకీల్, అక్రం తదితరులు పాల్గొన్నారు.

# కిక్కిరిసిన ఎత్తం గట్టు



ఎత్తం గట్టు ఆలయం వద్ద దర్శనానికి పోటెత్తిన భక్తజనం



ఆలయంలో కొలువుదీరిన రామలింగేశ్వరస్వామి

- లక్షలాదిగా తరలివచ్చిన భక్తులు

కోడేరు, జనవరి 16 : మండలంలోని ఎత్తం గ్రామ శివారులోని ఎత్తం గట్టుపై వెలిసిన రామలింగేశ్వరస్వామి ఉత్సవాలకు భక్తులు పోటెత్తారు. ఏటా సంక్రాంతి సందర్భంగా రామలింగేశ్వరస్వామి ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహిస్తారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే అత్యంత ఎతైన ఎత్తం గట్టుపై కొలువుదీరిన రామలింగేశ్వరస్వామిని తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భక్తులు లక్షలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు స్వామి వారి వద్దకు గట్టుకి వెళ్లలేని భక్తులు కోడేరు వైపున ఉన్న ముఖద్వారం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఎత్తం వైపున ఉన్న ముఖద్వారం వద్ద పెద్ద ఎత్తున జాతర ఏర్పాట్లు చేశారు. గట్టు కింద ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు ముందుగా దర్శనం చేసుకొని గట్టుపైకి ఎక్కారు. ఈ ఏడాది ఆంజనేయస్వామి ఆలయంలో కూడా పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. ఆకుపూజలతోపాటు హోమం వివిధ రకాల పూజలు నిర్వహించారు. ఎత్తం, కొండ్రావుపల్లి గ్రామాలకు చెందిన మాజీ ఎమ్మెల్యే హర్షన్న యువసేన నాయకులు భక్తులకు ఉచితంగా అన్నదానం చేశారు. ఈ అన్నదాన కార్యక్రమాలను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. కొండ్రావుపల్లి మాజీ సర్పంచ్ కలమందరాజేశ్, సాయికుమార్, రమేశ్, మల్లయ్య, మారుతి తదితరులు సొంత ఖర్చుతో భక్తులకు అన్నదానం చేశారు.





ఊరేగింపులో పాల్గొన్న గువ్వల దంపతులు, మూడో కన్నుతో మంటను వెదజల్లుతున్న కళాకారుడు

## వైభవంగా ప్రభోత్సవం

అచ్చంపేట టౌన్, జనవరి 16 : పట్టణంలో సోమవారం భ్రమరాంబ ఆలయం నుంచి ఉత్సవ మూర్తుల ప్రభోత్సవం ఉమామహేశ్వర క్షేత్రానికి చేరుకున్నది. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు పాల్గొని ఉత్సవమూర్తులను దర్శించుకొని పూజలు చేశారు. ఊరేగింపులో నుదుటి మూడో కన్ను నుంచి మంటను వెదజల్లే కార్యక్రమం, వివిధ వేషధారణలో వచ్చి వారు ప్రదర్శించిన కళలు చూపరులను ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు శ్రీను, కమిటీ సభ్యులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా అంజన్న ఉత్సవాలు

- పాతపల్లిలో మాంసాహారంతో నైవేద్యాలు సమర్పించిన భక్తులు



పాతపల్లి అంజన్న ఆలయం వద్ద భక్తుల రద్దీ

పెబ్బేరు, జనవరి 16 : మాంసాహారమే నైవేద్యంగా సమర్పించే విశిష్టత కలిగిన పెబ్బేరు మండలం పాతపల్లి వద్దనున్న చింతలకుంట ఆంజనేయ స్వామి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ప్రతి సంక్రాంతి పర్వదినాన రెండు రోజులపాటు జరిగే ఉత్సవాల సందర్భంగా సోమ, మంగళవారాల్లో భక్తులు పెద్దఎత్తున దర్శించుకొన్నారు. ఇక్కడ కొలువైన ఆంజనేయస్వామికి భిన్నమైన రీతిలో భక్తులు మాంసాహారాన్ని నైవేద్యంగా సమర్పిస్తారు. ఇందుకు గానూ కోళ్లు, పొట్టేళ్లను బలిచ్చి వాటితో చేసిన వంటకాలను స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ ఉత్సవాలకు చుట్టుపక్కల గ్రామాల నుంచే గాకుండా, పొరుగు జిల్లాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు పాతపల్లి సర్పంచ్ రవీందర్‌నాయుడు, ఆలయ పూజారి వెంకటేశ్వర్లు తెలిపారు.

# సాఫ్ట్‌బాల్ టోర్నీకి జట్ల పయనం

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 16 : నిజామాబాద్ జిల్లాలో నేటినుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు తరలివెళ్లాయి. మంగళవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ అండర్–17 సెక్రటరీ రమేశ్‌బాబు జట్టు క్రీడాకారులకు అభినందించారు. కార్యక్రమంలో పీఈటీలు రాఘవేందర్, నాగరాజు, మేరిపుష్ప, సుగుణ, నాగమణి, రమాదేవి తదితరులు ఉన్నారు.

***జట్టు వివరాలు..***

**బాలుర జట్టు :** పవన్, ప్రవీణ్, ధరమ్‌నాయక్, శ్రీరామ్, రామ్‌చరణ్, వరుణ్‌యాదవ్, శివనంద్, అభిలాష్, శ్రీచేతన్, విజయ్‌భాస్కర్, నవీన్, ఆర్యన్, మల్లేశ్, విజయ్‌కుమార్, సంజయ్.

**బాలికల జట్టు :** కాంచన, భాను, పల్లవి, ఆరాధ్య, సాయికీర్తన, మల్లిక, లలిత, నందిని, అనూష, వైష్ణవి, ప్రణీత, రూప, వైష్ణవి, పూజ, గౌరి, సుష్మిత.



టోర్నీకి వెళ్తున్న ఉమ్మడి జిల్లా బాల, బాలికల జట్లు